కొండను కొల్లగొట్టేస్తున్నారు

- జట్లమ్మ కొండపై భారీ యంత్రాలతో అక్రమ తవ్వకాలు
- పట్టపగలే లారీలతో గ్రావెల్, రాళ్ల తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు


తరలించేందుకు గ్రావెల్ సిద్ధం చేస్తున్న పొక్లెయిన్


ఆనందపురం జట్లమ్మ కొండపై తవ్వకాలకు వినియోగిస్తున్న పొక్లెయిన్

తగరపువలస : కొందరు అక్రమార్కులు కొండను కొల్లగొట్టేస్తున్నారు. పగలు రాత్రి అన్న తేడా లేకుండా యంత్రాలతో కొండను తొలిచి గ్రావెల్, రాళ్లను లారీలతో తరలించేస్తున్నారు. స్థానికులు అడ్డు తగిలినా ఆనందపురం, పాలవలసలకు చెందిన పొక్లెయినర్ల యజమానులు బెదిరించి మరీ తవ్వకాలు జరుపుతున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల పల్లెలో జరగడం లేదు. మండల కేంద్రమైన ఆనందపురంలోని జట్లమ్మ కొండ సర్వే నంబర్ 276లోనే అక్రమ తవ్వకాలు స్వేచ్ఛగా జరిగిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కొండపై తవ్వకాలకు అనుమతులు లేవని తహసీల్దార్ హేమంత్ కుమార్ చెబుతున్నా... అక్రమంగా కొండను తవ్వుతున్న వారిపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఇక్కడి అధికారుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తూతూ మంత్రంగా వీఆర్వోలు గురువారం రెండు పొక్లెయినర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. అయితే వాటిలో ఆనందపురానికి చెందిన పొక్లెయిన్ యజమాని రెవెన్యూ సిబ్బందిని ఖాతరు చేయకుండా తన వాహనాన్ని ఇంటికి పట్టుకుపోయాడు. ఈ


తవ్వకాలు జరుపుతున్న కొండ ప్రాంతం

వ్యవహారం అంతా చూస్తుంటే రెవెన్యూ అధికారుల నిజాయతీ తేటతెల్లమవుతోందని స్థానికులు అంటున్నారు. అధికారుల అండదండలతోనే జట్లమ్మ కొండను పట్టపగలే కొల్లగొడుతున్నారని... అందుకే అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి కొండను కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో భాగస్వాములవ్వాలి

- మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు


వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం : ప్రజా సమస్యల పరిష్కారంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. భీమిలిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధులతో గురువారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రజల బాగోగులు చూసుకోవాలన్నారు. నిత్యం వారి సమస్యలు తెలుసుకుంటూ అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, నాయకులు దాట్ల పెదబాబు, పిన్నింటి రమణ, నల్ల బాబు, ఎస్.కరుణాకర రెడ్డి, బాకి రమణారెడ్డి, జీవీ రమణ, వాసుపల్లి కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరం, కుసులవాడ, ఎస్‌జీఆర్‌పురం గ్రామాల్లో భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ గురువారం పర్యటించారు. ఎస్‌జీఆర్ పురం రెవెన్యూ గ్రామంలో గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే గంభీరంలో సర్వే నంబర్ 149కు సంబంధించి వెబ్ ల్యాండ్‌లో ప్లాట్ యజమానులు దరఖాస్తు చేసుకున్న స్థలాలను పరిశీలించారు. అనంతరం కుసులవాడలోని వివాదాస్పద భూములను పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ హేమంత్ కుమార్, సర్వేయర్లు రాజేష్, దేవి, నరేష్, రోహిత్, వీఆర్వో దేవరాజ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అల్లుకున్న నిర్లక్ష్యం


విద్యుత్ వైర్లను చుట్టేసిన పాదలు

కొమ్మాది : బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల వెంబడి పొదలు పెరగడమే కాకుండా, విద్యుత్ స్తంభాలకు సైతం అల్లేయడంతో వర్షం కురిసే సందర్భంలో మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కూడా కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపులుప్పాడ పరిధి రెడ్డిలపాలెంలో విద్యుదాఘాతంతో బుధవారం ఓ ఆవు చనిపోయింది. అటువంటి ఘటనలు, ప్రమాదాలు సంభవించక ముందే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వైర్లకు అల్లుకున్న పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి


మొక్క నాటుతున్న అడిషినల్ సీడీపీవో నీలిమ, విద్యార్థులు

పద్మనాభం : బాల్య వివాహాలు చేయడం నేరమని భీమునిపట్నం ఐసీడీఎస్ అడిషినల్ సీడీపీవో నీలిమ అన్నారు. పద్మనాభం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మహిళా చట్టాలు, గృహహింస, బాల్య వివాహాల నిర్మూలనపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. 18 ఏళ్లలోపు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం బాల్య వివాహాలు నిర్మూలించాలని మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో ప్రీ స్కూల్ పిల్లలతో కలిసి ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.ఉమా జానకి, పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి


జగన్నాథం

పద్మనాభం : మండలంలోని పెంట గ్రామంలో ఒక వ్యక్తి పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. పెంట గ్రామానికి చెందిన చప్ప జగన్నాథం (52)ను ఈ నెల 22న రాత్రి పొలంలో విష సర్పం కాటేసింది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున జగన్నాథం మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

27 నుంచి సత్యసాయి సేవా సంస్థల కార్యక్రమాలు

తగరపువలస : సత్యసాయిబాబా 99వ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఆనందపురం మండలం ముచ్చర్లలో 27 నుంచి రెండు రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం సత్యసాయి సామూహిక వ్రతాలు, ఆదివారం ఉదయం సాధారణ, కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం పల్లకీసేవ నిర్వహిస్తారు.

జగనన్న ఇళ్ల స్థలాలపై రాజకీయాలొద్దు


వేములవలసలోని జగనన్న కాలనీ వద్ద పట్టాలు చూపిస్తున్న లబ్ధిదారులు

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస జగనన్న కాలనీపై రాజకీయాలు చేయడం తగదని మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్యకుమారి అన్నారు. లబ్ధిదారులతో కలిసి కాలనీ వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయంటూ కొందరు చేస్తున్న ఆరోపణల్లో పస లేదన్నారు. దీనిపై అవసరమైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాజకీయాలు మాని కాలనీలో వసతులు కల్పించే పని చూడాలని లబ్ధిదారులు కోరారు. పంచాయతీలో జగనన్న కాలనీకి 377 మంది దరఖాస్తు చేసుకుంటే 2020లో మొదటి విడతగా 100 మంది అర్హులకు కేటాయించారన్నారు. వీరిలో మృతి చెందిన వారి పేరుతో పట్టాలు ఇచ్చినట్టు కొందరు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కొందరు రాజకీయ నాయకుల వల్ల పట్టాల జారీలో జాప్యం జరిగిందన్నారు. అలాగే సర్వే నంబర్ 151/1లో 100 మందికి, మిగిలిన వారికి సర్వే నంబరు 155లో ఇళ్లు మంజూరు చేసి పట్టాలు ఇచ్చారని తెలిపారు. తప్పుడు ఆరోపణలు మానుకుని కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

వీధిలైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జంక్షన్ నుంచి తిమ్మాపురం వెళ్లే రోడ్డులో కొత్తగా వీధిలైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించినట్టు అధికారులు తెలిపారు. ఈ 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డులో లైట్లు లేక జేఎన్ఎన్‌యూఆర్ఎం పరదేశిపాలెం – 2తోపాటు మరో కాలనీ వాసులు, ఐటీ సెజ్, ఇతర ప్రాంతాల్లో పనులు చేసే కార్మికులు, ఉద్యోగులు రాత్రి వేళ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులపై 'వీధి లైట్లు వెలగక చిమ్మ చీకట్లు' అనే శీర్షికతో సాక్షిలో గురువారం కథనం ప్రచురితమవడంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. వీధిలైట్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన


మధురవాడలో సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర బృందం సభ్యులు

మధురవాడ : విశాఖ జిల్లాలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను రాష్ట్ర బృందం గురువారం పరిశీలించింది. ఇందులో భాగంగా గురువారం మిథిలాపురి వుడా కాలనీ, బక్కన్నపాలెం, రుషికొండ యూపీహెచ్‌సీల పరిధిలోని మధురవాడ, ఎం – 2 కాలనీ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. ప్రోగ్రాం ప్రతినిధి సురేష్ కుమార్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ప్రియదర్శిని తదితరులు మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించి మరింత మెరుగ్గా వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. అలాగే వ్యాక్సినేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించడం వల్ల వ్యాధి నివారణ సత్వరమే సాధ్యమవుతుందన్న విషయాన్ని అంతా గమనంలో ఉంచుకుని పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా క్షయ నివారణ కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్, మధురవాడ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు కాసుల హారం బహూకరణ


ఈవో శ్రీనివాసమూర్తికి బంగారు హారం అందజేస్తున్న దాత వరహాలరెడ్డి

సింహాచలం : సింహాచలం నృసింహ స్వామికి గురువారం మధురవాడకు చెందిన మేడపాటి నరసింహ వరహాలరెడ్డి 15 గ్రాముల బంగారు కాసుల హారం, 750 గ్రాముల వెండి అష్టలక్ష్మి కలశ బహూకరించారు. వీటిని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస : చిట్టివలస 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్ – 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శనగర్, సప్తగిరి లే అవుట్, చిట్టివలస జ్యూట్ మిల్లు క్వార్టర్స్ లైన్, రామన్నపేట, చిల్లపేట, జీరుపేట, ఊళ్లపేట, సంగివలస, భీమిలి మండల పరిధిలోని తాటితూరు, టి.నగరపాలెం, మజ్జివలస, శింగనబంద, లక్ష్మీపురం, విజయరాంపురం, నారాయణరాజుపేట పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శివశక్తినగర్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు శివశక్తినగర్ రోడ్డు, సద్గురు సాయినాథ్ కాలనీ, గణేష్‌నగర్, శ్రీలక్ష్మినగర్, అయ్యప్పనగర్, వైఎస్సార్ కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, టైలర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

కొమ్మాది / మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 బక్కన్నపాలెంలో గల హుద్‌హుద్ గృహ సముదాయంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు చేస్తున్న ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. నీరు, కరెంటు వంటి సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అదేవిధంగా కాలనీలో చెత్త బాగా పెరిగిపోయి దోమలు, పాములతో సహవాసం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట


కోలాటం ప్రదర్శిస్తున్న పద్మనాభం హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస : సంస్కృతి, సంప్రదాయాలకు దేశంలో పెట్టపీట వేస్తున్నామని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ కళలను వివరించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో హాజరై పెయింటింగ్, నృత్యాలు, జానపద కళలు, తోలు బొమ్మలాట గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, తదితరులు పాల్గొన్నారు.


వేషధారణలతో బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులు

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు

పద్మనాభం : శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. పద్మనాభం, రెడ్డిపల్లి, ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కోలాటం నిర్వహించారు.

రైతుల పోరాటానికి పలువురి మద్దతు


బక్కన్నపాలెంలో రైతుల పోరాటానికి మద్దతు తెలుపుతున్న నాయకులు

మధురవాడ : నవోదయ, ఇతర ప్రభుత్వ సంస్థల భవనాల నిర్మాణం కోసం భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని పోరాడుతున్న కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్ల పాలెం గ్రామాల రైతులకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. బక్కన్నపాలెంలో సినీ పరిశ్రమ నిర్మించిన ఎన్టీఆర్ హుద్‌హుద్ గృహ సముదాయం వద్ద కొద్ది రోజులుగా రైతులు నిరశన తెలుపుతున్న విషయం తెలిసిందే. వారి దీక్షా శిబిరాన్ని ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఎం.రమణ, టీడీపీ నాయకులు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. రైతులకు న్యాయంగా రావాల్సిన నష్ట పరిహారం ప్రభుత్వం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు, నాయకులు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పేద దళిత, బీసీ రైతులకు కనీసం ఇళ్లయినా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బి.పోతురాజు, డి.అప్పలరాజు, ఎస్.పైడితల్లి, దేవుడు, ఎస్.రాజు, అచ్చన్న, అరుణ పాల్గొన్నారు.

కాలుష్యం వల్లే పక్షుల వలస తగ్గుదల


చిట్టివలస చెరువు వద్ద వాటర్‌మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్, తదితరులు

- చిట్టివలస చెరువుకు 107 రకాల పక్షులు వచ్చేవి
- వాటర్‌మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస చెరువుపై 107 రకాల పక్షులు ఆధారపడి ఉండేవని వాటర్‌మేన్ ఆఫ్ ఇండియా, రామన్ మెగాసిస్ అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్ అన్నారు. గురువారం ఆయన భీమిలి రోడ్డులోని చిట్టివలస – చిల్లపేట చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు దేశ వ్యాప్తంగా ఉన్న చెరువులను రక్షించాలన్నారు. చెరువులను నోటిఫై చేసి బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో ఉన్న మ్యాప్‌ల ప్రకారం పరిరక్షించాలన్నారు. చెరువు గర్భంలో ఫెన్సింగ్‌లు, తోటలను తొలగించాలన్నారు. చిట్టివలస చెరువులో కాలుష్యం పెరిగిపోవడంతోపాటు, తదితర కారణాల వల్ల పక్షుల వలస తగ్గిపోయిందన్నారు. ఈ చెరువు పరిరక్షణపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టి సారించాలన్నారు. ఆయనతోపాటు జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత అధికారి ప్రొఫెసర్ రాజశేఖర రెడ్డి, జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ వికాస ప్రతినిధి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్త హంగులతో జోనల్ కార్యాలయం సిద్ధం



కొత్తగా తయారైన జోనల్ కమిషనర్ చాంబర్


సిద్ధమైన జోనల్ కార్యాలయ భవనం

- గత ప్రభుత్వంలో రూ.50 లక్షల కేటాయింపు
- ఆధునికీకరించిన జీవీఎంసీ అధికారులు

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయ భవనం ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. కొత్త హంగులతో ప్రారంభానికి సిద్ధమైంది. గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు పూర్తి చేయడంతో సుందరంగా ముస్తాబైంది. భీమిలి మున్సిపాలిటీగా వున్నప్పుడు గతంలో బ్రిటిష్ వారు నిర్మించిన భవనంలో మున్సిపల్ కార్యాలయం నిర్వహించేవారు. అది దెబ్బతినడంతోపాటు పనులు చేసుకోవడానికి ఇబ్బందికరంగా మారడంతో 2010లో కొత్త భవనం నిర్మించారు. అప్పటి నుంచి అందులోనే మున్సిపల్ కార్యాలయం నిర్వహించేవారు. అనంతరం భీమిలి మున్సిపాలిటీ 2013లో జీవీఎంసీలో విలీనం కావడంతో అప్పటి నుంచి జోనల్ కార్యాలయంగా వినియోగించేవారు. అయితే ఆ భవనంతోపాటు అందులోని గదులు కూడా దెబ్బతిని పాడైపోవడంతో సిబ్బందికి సమస్యగా మారింది. దీనిపై స్పందించిన గత ప్రభుత్వం మరమ్మతులు నిర్వహించి ఆధునికీకరించేందుకు రూ.50 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో పనులు ప్రారంభించి భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని గదులకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి రంగులు వేయడంతోపాటు కొత్త ఫర్నీచర్ కూడా ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ దాదాపు పూర్తి కావచ్చాయి. త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ భవనం ప్రారంభిస్తే గత పదేళ్లుగా ఇబ్బంది పడిన జోనల్ కార్యాలయం సిబ్బంది ప్రశాంతంగా విధులు నిర్వహించుకోవడంతోపాటు ఇక్కడికి వచ్చే ప్రజలు కూడా సంతోషిస్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించడం వల్లే భవనం ఆధునికంగా మారిందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి


తగరపువలస అంబేద్కర్ కూడలిలో నిరశన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తగరపువలస : ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మన రాష్ట్రానికి మొండి చేయి చూపించారని నిరశిస్తూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం నిరశన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ఉద్దేశం ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఉద్యమాలు జరుగుతున్నా బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటనా చేయలేదన్నారు. విశాఖకు మెట్రో రైల్ ఊసు కూడా లేదన్నారు. అంగన్‌వాడీలకు కేటాయింపులు లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రకు, రాష్ట్ర పురోగతికి బడ్జెట్‌లో గ్రాంట్లు విడుదల చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. విశాఖ రైల్వే జోన్‌ను వెంటనే ప్రకటించి రాష్ట్రాభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, పెంటరాజు, రీసు నరసింహారావు, ఈశ్వరరావు, పంపాన సూర్యనారాయణ, జీరు అచ్చారావు పాల్గొన్నారు.